www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 20 అక్టోబర్ 2025



బోసిపోతున్న టపాకాయల దుకాణాలు

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సోమలలో రెండు, పెద్ద ఉప్పరపల్లిలో ఒకటి, కందూరులో ఒకటి చొప్పున టపాకాయల అమ్మకాల దుకాణాలు ఏర్పాటు చేశారు. నిరవధికంగా కురుస్తున్న వర్షాల కారణంగా కొనుగోలుదారులు లేక తెచ్చిన సరుకు తెచ్చినట్లే ఉందని, వర్షం నిలిచి ఎండ కాస్తే తమకు అమ్మకాలు జరిగే అవకాశం ఉందని దుకాణాల యజమానులు అంటున్నారు.



కొనుగోలుదారులు లేక బోసిపోతున్న టపాకాయల దుకాణాలు

మొరవపై ప్రమాదకర ప్రయాణం

- ప్రజల ఇబ్బందులు తొలిగేది ఎన్నటికో..
- స్తంభించిన రాకపోకలు
- పైకి పొంగుతున్న పాతాల గంగ
- దళవాయి చెరువు తూముకు గండి



ప్రజాశక్తి- సోమల: సోమల మండలం ఇరికిపెంట పంచాయతీ గువ్వలగుట్ట గ్రామస్తుల కష్టాలు ఎప్పటికీ తీరేనో అని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. శనివారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి ఇరికిపెంట చెరువు మరింత ఉధృతంగా ప్రవహించడంతో మొరవకు సమీపంలోని గువ్వలగుట్టకు వెళ్లే మట్టి దారి కొట్టుకుపోయింది. దీంతో గువ్వల గుట్టకు పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి. నాలుగు రోజుల క్రితం వినాయకపురం గ్రామానికి చెందిన దుర్గ అనే బాలింత తన 20 రోజుల బిడ్డతో కలిసి గువ్వల గుట్టలోని బంధువుల ఇంటికి వచ్చింది. శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మట్టి రోడ్డు కొట్టుకుపోవడంతో ఆమె తిరిగి వినాయకపురానికి ఎలా వెళ్లాలో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. దీంతో ఆదివారం ఉదయం ఎనిమిది గంటల ప్రాంతంలో గువ్వలగుట్ట గ్రామానికి చెందిన కొందరు యువకులు అడవి మార్గం గుండా 20 రోజుల పసికందును చిన్నారి తల్లి దుర్గను భుజాలపై ఎత్తుకొని ప్రమాదకరంగా ప్రవహిస్తున్న చెన్నపట్నం చెరువు మొరవకు ఆ వైపు నుండి ఈ వైపుకు ఎలాగోలా దాటించారు దీంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. తమకు ఇలాంటి వెతలు కొత్త కాదని వర్షాలు కురిసి దారులు కొట్టుకుపోయినప్పుడు ప్రతిసారి ఎన్నో వ్యాయ ప్రయాసల కోర్చి నిత్యావసర సరుకుల కోసం ఆసుపత్రుల కోసం వెళ్లాల్సి వస్తోందని తమ బాధలు కలెక్టర్‌కు మొరపెట్టుకున్నామని ఆయన కూడా తమ గ్రామానికి వచ్చి పరిస్థితి పరిశీలించారని సాధ్యమైనంత తొందరగా తమ గ్రామానికి దారి సౌకర్యం ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

భారీ వర్షాలకు పొంగుతున్న పాతాల గంగ

మండల కేంద్రమైన సోమల పంచాయతీ మునిరెడ్డిగారిపల్లికి చెందిన బాలాజీ అనే రైతు పొలంలోని బోరు బావిలో నుండి నీరు పైకి ఉబికి వస్తున్నాయి. ఎడతెరిపి లేని వర్షాలు నలపు వానికుంట సమీపంలో బాలాజీ వ్యవసాయ పొలాలు ఉండడం బోరు బావి చెరువుకు సమీపంలోనే ఉండడం చెరువు నిండి మొరవ పోతూ ఉండడం కారణంగా బోరు బావిలో నీరు మోటారు వేయకుండానే పైకి ఉబికి వస్తున్నాయి. దాదాపు 600 అడుగుల లోతులోని బోరుబావి నుండి నీరు వస్తున్నట్లు రైతు తెలిపారు.



బోరు బావిలో నుండి పైకి ఊబికి వస్తున్న నీరు

దళవాయి చెరువు తూముకు గండి

సోమల మండలం పొదలకుంటపల్లి పంచాయతీ దళవాయి చెరువు తూము వద్ద గతంలో గండిపడి నంజంపేట పగలకుంటపల్లి మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఆ తర్వాత తాత్కాలిక మట్టి వంతెన నిర్మించారు. శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి దలవాయి చెరువు పూర్తిగా నిండి తాత్కాలిక మట్టి వంతెన కొట్టుకుపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఇకనైనా శాశ్వతంగా కట్టపై తూము వద్ద నూతన తూము నిర్మించి రోడ్డు నిర్మాణం చేసి పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి జీడి రేవుల వంకపై నిర్మించిన తాత్కాలిక మట్టి వంతెన కొట్టుకుపోయింది. వంక ఉధృతంగా ప్రవహిస్తోంది.



నిలచిపోయిన రాకపోకలు

సోమల మండలం ఇరికిపెంట పంచాయతీ బంగ్లా వద్ద ఉన్న చెన్నపట్నం చెరువు మొరవ ఉధృతి కారణంగా మొరవ సమీపంలోని తాత్కాలిక మట్టి వంతెన కొట్టుకుపోయింది. దీంతో గువ్వలగుట్టకు గ్రామంలోని 15 కుటుంబాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అటవీ ప్రాంతంలోనే వారు ఉండిపోయే పరిస్థితి ఏర్పడింది. ఇటీవల రైతులు స్వచ్ఛందంగా పైపులు వేసి మట్టి తోలి దారి సిద్ధం చేశారు అది కాస్త మళ్ళీ వర్షానికి కొట్టుకుపోవడంతో రైతులు ఈ ప్రాంత ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వినాయకుని సేవలో ప్రముఖులు





వినాయకుని సేవలో జస్టిస్ అనుపమ చక్రవర్తి, సినీ హీరో గల్లా అశోక్

ప్రజాశక్తి - ఐరాల

శ్రీవరసిద్ధి వినాయక స్వామివారిని ఆదివారం పాట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనుపమ చక్రవర్తి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అలాగే మాజీ ఎంపీ గల్లా జయదేవ్ తనయుడు సినీ హీరో గల్లా అశోక్, తిరుమల తిరుపతి దేవస్థానం చీఫ్ విజిలెన్స్, సెక్యూరిటీ ఆఫీసర్ మురళీకృష్ణ కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. వీరితోపాటు పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ అయ్యప్ప దీక్ష పూర్తిచేసుకుని మాలా విరమణ చేయడానికి కాణిపాకం విచ్చేసి స్వామివారి దర్శించుకోవడం జరిగింది. వీరికి ఏఈవో ఎస్వీ కృష్ణారెడ్డి స్వాగతం పలికి దర్శన ఃఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు శేషవస్త్రం చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ వాసు, చైర్మన్ మణి నాయుడు, టెంపుల్ ఇన్స్పెక్టర్ బాలాజీ నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

నిత్య అన్నదానం ట్రస్ట్‌కి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి- ఐరాల: శ్రీవరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానం నిత్య అన్నదానం ట్రస్ట్‌కి బెంగళూరు వాస్తవ్యులు రవికాంత్ వారి కుటుంబ సభ్యులు రూ.లక్షల చెక్కును విరాళంగా అందజేశారు. ఆదివారం చెక్కును ఆలయ సూపరింటెండెంట్ వాసు, టెంపుల్ ఇన్స్పెక్టర్ బాలాజీ నాయుడు అందుకున్నారు.



చెక్కును అందజేస్తున్న దాత రవికాంత్

కరుగుతున్న గుట్టలు

- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - రొంపిచర్ల: రొంపిచెర్ల మండలం చెంచమరెడ్డిగారిపల్లి గ్రామపంచాయతీలోని గుట్టలు అధికారుల కళ్ళ ముందరే కరిగిపోతున్నా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. చెంచమరెడ్డిగారిపల్లి గ్రామం బుసిరెడ్డిగారి పల్లెకు పక్కన ఉన్న సర్వే నెంబరు 51లో ఉన్న గుట్టను కొందరు జెసిబి యంత్రాలతో చదును చేసి ఆక్రమించుకుంటున్నారు. గ్రామస్తుల అవసరాల కోసం కేటాయించిన గుట్టను నామరూపాలు లేకుండా చేస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. గతంలో ఒకరికి ఒక ఎకరా భూమిని పట్టా ఇచ్చారని దాన్ని మరొకరు కొనుగోలు చేసి ఒక ఎకరా భూమిని చూపి మూడు ఎకరాల గుట్టను చదును చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. భూముల ధరలకు రెక్కలు రావడంతో గుట్టలను కూడా వదలడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే మూడు ఎకరాల గుట్టను చదును చేశారని ఈ విషయాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశువులను, మేకలు, గొర్రెలను మేపుకునేందుకు గుట్టలు, నీటి కుంటలు కూడా కనబడకుండా ఆక్రమిస్తున్నారని వాపోయారు. రెవెన్యూ అధికారులు వెంటనే అక్రమార్కుల నుంచి గుట్టను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు. మండల రెవెన్యూ శాఖ అధికారులు చర్యలు తీసుకోకపోతే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని గ్రామస్తులు తెలిపారు.

అక్రమార్కులపై చర్యలు తీసుకుంటాం..

- కిరణ్ కుమార్, తహసీల్దారు



బుసిరెడ్డిగారిపల్లె పక్కన ఉన్న గుట్టను ఆక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటాం. గతంలో ఏమైనా పట్టా ఇచ్చారని విచారణ చేసి చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రభుత్వ భూములను ఎవరు ఆక్రమించిన వదిలే ప్రసక్తి లేదని అన్నారు.





జెసిబితో గుట్టలను తవ్వి చదును చేస్తున్న దృశ్యం

తగిన జాగ్రత్తలతో దీపావళి జరుపుకోవాలి

- జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి పెద్దిరెడ్డి



ఇంటర్వ్యూ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: దీపావళి చిన్న, పెద్ద వయసుతో తారతమ్యం లేకుండా జరుపుకునే అతిపెద్ద పండుగ. మన జీవితాల్లో వెలుగులు నింపాలంటే తగిన జాగ్రత్తలు తీసుకొని ఎలాంటి ప్రమాదాలకు గురికాకుండా దీపావళి జరుపుకోవాలని జిల్లా అగ్నిమాపక అధికారి పెద్దిరెడ్డి సూచించారు. ముఖ్యంగా టపాకాయలు కాల్చేటప్పుడు చిన్న పిల్లల సమీపంలోనే పెద్దలు ఉంటూ జాగ్రత్తగా గమనిస్తూ ఉండాలని ప్రజాశక్తి ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన సూచించారు.

ప్రజాశక్తి: టపాకాయల దుకాణాలకు అనుమతులు ఎలా మంజూరు చేస్తున్నారు..?

జిల్లా అగ్నిమాపక అధికారి: ఈ ఏడాది దీపావళిని పురస్కరించుకొని చిత్తూరు జిల్లాలో దాదాపు 600కు పైగా టపాకాయల విక్రయాల తాత్కాలిక లైసెన్సులు జారీ చేయడం జరిగింది. జనసంచారం తక్కువ ఉండే ప్రాంతాల్లో విశాలమైన స్థలం ఉండేలా చూసుకుని అనుమతులు మంజూరు చేసాం.

ప్రజాశక్తి: టపాకాయలు కాల్చేటప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి..?

జిల్లా అగ్నిమాపక అధికారి: ప్రధానంగా పెద్ద శబ్దాలు చేసే టపాకాయలు కాల్చడాన్ని నిషేధించడం జరిగింది. ఇతరులకు ఇబ్బంది కలిగించేలా టపాకాయలను కాల్చరాదు. సమీపంలో బకెట్లో నీటిని అందుబాటులో ఉంచుకోవడంతో పాటు మందమైన కాటన్ దుస్తులు వేసుకోవడం మంచిది. చిన్నపిల్లలు టపాకాయలు కాల్చేటప్పుడు పెద్దలు సమీపంలో ఉంటూ గమనిస్తూ ఉండాలి.

ప్రజాశక్తి: ప్రమాదాల సందర్భంగా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి....?

జిల్లా అగ్నిమాపక అధికారి: అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపక అధికారులకు ఫోన్ ద్వారా అంటే 100కు ఫోన్ చేసి సమాచారం అందించాలి. సమీపంలోని ఫైర్ స్టేషన్ నుండి సిబ్బంది వచ్చేలోపుగా మంటలను అదుపు చేసేందుకు ఇసుక, మట్టి వేసి మంటలను అదుపు చేయాలి.

ప్రజాశక్తి: టపాకాయల విక్రయ కేంద్రాల వద్ద ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు...?

జిల్లా అగ్నిమాపక అధికారి: టపాకాయల దుకాణాలు ఏర్పాటు చేసే వాళ్లకు ముందుగానే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించడం జరుగుతోంది. మంటలను అదుపు చేసేందుకు నేటి డ్రమ్ములు ఇసుక మూటలు సమీపంలో అందుబాటులో ఉంచుకోవాలి. టపాకాయల విక్రయాల కేంద్రాల వద్ద అగ్నిమాపక, పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేయడం జరిగింది.

వ్యవసాయ పంటలపై ఏనుగుల గుంపు దాడి



నష్టపోయిన రైతులకు పరిహారం చెక్కులు అందిస్తున్న మహమ్మత్ షఫీ

ప్రజాశక్తి - రొంపిచర్ల: పులిచెర్ల మండలంలో ప్రతిరోజు ఏదో ఒక గ్రామంలో ఏనుగులు దాడి పరిపాటిగా మారింది. పులిచెర్ల రిజర్వ్ ఫారెస్ట్‌లో తిష్ట వేసిన ఏనుగుల గుంపు నిత్యం అర్ధరాత్రి దాటాక అటవీ ప్రాంతానికి దగ్గరలో ఉన్న వ్యవసాయ పంటలపై దాడి చేసి రైతులను నష్టపరుస్తున్నాయి. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారు జామున పాలెం పంచాయితీలో రైతులు మునిస్వామి, శివకుమార్, మోహన్, జయపాల్, శు భరత్నం రైతులకు చెందిన పశువుల మేతకు నాటుకున్న గడ్డి, కొబ్బరి చెట్లు, మామిడి చెట్లను ఏనుగుల గుంపు విరిచి, తిని తొక్కుకుంటూ విధ్వంసం చేశాయి. అటవీ శాఖ అధికారులు ఎఫ్ఎస్ఓ మహమ్మద్ షఫీ, ఎఫ్‌బిఓ మధు పంటలను పరిశీలించి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ద్వారా సాయం అందిస్తామని తెలిపారు. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ మహమ్మద్ షఫీ మాట్లాడుతూ పులిచెర్ల మండలంలో ఏనుగుల గుంపు దాడుల్లో పంటలు కోల్పోయిన దేవళంపేట, పాలెం పంచాయతీల్లో నష్టపోయిన 18 మంది రైతు బాధితులకు రూ.3,18,500లు నష్టపరిహారం చెల్లించినట్లు తెలిపారు.

ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



ప్రజాశక్తి చిత్తూరు అర్బన్: దీపావళి పండుగ సందర్భంగా జిల్లాలోని ప్రజలందరికీ పండుగ శుభాకాంక్షలను జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అంధకారంపై వెలుగు విజయం సాధించిన దీపావళి పండుగ ప్రతి కుటుంబానికి ఆనందం, ఐకమత్యం, సంతోషం నింపాలని ఆయన ఆకాంక్షించారు. అలాగే దీపావళి పండుగను సురక్షితంగా జరుపుకోవాలని ప్రజలకు సూచించారు.

జిల్లా ప్రజలకు పోలీసు కుటుంబాలకు దీపావళి పండగ శుభాకాంక్షలు: ఎస్పీ

ఈ దీపావళి ప్రతి ఇంటికి సంతోషాలు, ఆనందాలు, ఆరోగ్యాన్ని తీసుకురావాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడి కోరుతూ జిల్లా ప్రజలకు, పోలీసు కుటుంబాలకు దీపావళి పండగ శుభాకాంక్షలు తెలిపారు. దీపావళి వెలుగుల పండగగా, ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. పండుగ వేళ రోడ్లపై ట్రాఫిక్ నియంత్రణ, ప్రమాద నివారణ చర్యల ద్వారా ప్రజలకు సహకరించడానికి, పోలీసులు 24 గంటలు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. మీ పరిసర ప్రాంతంలో ఏవైనా అవాంచనీయ ఘటనలు చోటుచేసుకుంటే వెంటనే మీ దగ్గరలోని పోలీస్ స్టేషన్‌లో, డయల్ 112, పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ 9440900005కు సమాచారం అందించాలని తెలియజేశారు.



ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ సతీమణి గురజాల ప్రతిమ ఆదివారం జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సతీమణికి అలాగే జిల్లా ఎస్పీ తుషార్ డూడి సతీమణి అమూల్యని మర్యాదపూర్వకంగా కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలిపి మిఠాయిలు అందించారు. వారి వెంట గురజాల నీరజ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రతి సోమవారం జరిగే ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం దీపావళి పండుగ కారణంగా రద్దు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

పెట్రోల్ బంకుల్లో
కనీస సౌకర్యాలు నిల్..

ప్రజాశక్తి- యాదమరి: యాదమరి మండల పరిధిలో ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకులతో పాటు మొత్తం ఆరు పెట్రోల్ బంకులు ఉన్నాయి. ఇందులో మురుగన్ ఫ్యూయల్ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ పెట్రోల్‌బంక్‌లో వినియోగదారులకు కల్పించాల్సిన కనీస సౌకర్యాలైన నీటిశుద్ధి యంత్రం మరమ్మతులకు నోచుకుని ఏళ్లు గడుస్తున్నా వినియోగంలోకి తీసుకురాలేదు. వాహనాలకు ఉచితంగా గాలి పట్టుకునే వెసులుబాటు కల్పించాల్సి ఉన్నా అదీ రిపేరు అని అలాగే వదిలేశారు. ఇలా గాలి, నీరుతోపాటు వినియోగదారులకు అవసరమైన కనీస సౌకర్యాలైన మరుగుదొడ్లు కూడా అందుబాటులో లేవు. గత కొన్నేళ్లుగా తనికీలు చేయాల్సిన సంబంధిత అధికారులు నిద్రావస్థలో ఉండటంతో పెట్రోల్ బంకుల యాజమాన్యం ఇష్టానుసారంగా వ్యవహరిస్తోంది.

కేంద్ర రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ మార్గదర్శకాల ప్రకారం నాణ్యమైన ఇంధనంతో పాటు పెట్రోల్ బంకుల్లో వసతులు కల్పించాలి. యాదమరి మండల కేంద్రంలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ పెట్రోల్ బంకు ప్రజలకు వినియోగదారులకు వసతులు కల్పించడంలో పూర్తిగా విరుద్ధం. మండల కేంద్రలో మండల కార్యాలయాలు, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ టెర్మినల్ ఉండడంతో ఇక్కడ రద్దీ ఎక్కువగా ఉంటుంది వినియోగదారులు అధిక సంఖ్యలో ఉంటారు. అయితే ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు వద్ద ప్రజలు తాగేందుకు నీరు కూడా ఉండదు. పెట్రోల్ బంకుల్లో ఏడాది ఒకసారి అధికారులు తనిఖీలకు వచ్చినపుడు మాత్రం అన్ని ఏర్పాట్లు చేసినట్లు రికార్డుల్లో మాత్రమే చూపుతున్నారు. అప్పటికప్పుడు అన్ని సిద్ధం చేసి అన్ని సౌకర్యాలు ఉన్నట్లు చూపుతున్న నిర్వాహకులు తర్వాత నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. మరుగుదొడ్లు ఉన్నట్లు రికార్డుల్లో చూపిస్తున్న అవి అక్కడ పనిచేసే సిబ్బందికి మాత్రమే ఉపయోగిస్తారు తప్ప వినియోగదారులకు అనుమతి లేదు. వాహనాలకు గాలి ఉచితమని బోర్డులు ఉన్న యంత్రాలు ఏళ్ల తరబడి పనిచేయడం లేదు. తూకం పరికరం, పెట్రోలు నాణ్యత తెలుసుకునే పేపరు ఊసే లేదు. 24 గంటలు పెట్రోల్ బంకులు తెరిచి ఉంచాలని నిబంధన ఉన్నా రాత్రి 10 గంటల నుండి తెల్లవారు జాము ఐదు గంటల వరకు మూసేస్తున్నారు. ఈ క్రమంలో వినియోగదారులు అత్యవసరమైనా ఎదురు చూడాల్సిందే దీంతో వాహనదారులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.






ఏడాదిగా మరమ్మతు గురైన నీటి శుద్ధి యంత్రం , మూడు నెలల పాటు బాత్రూంకు తాళాలు వేసిన దృశ్యం

పెట్రోల్ బంకుల్లో నిబంధనలు...

- ప్రతి పెట్రోల్ బంకుల వద్ద వినియోగదారులకు కనిపించేలా శుద్ధమైన తాగునీరు ఉంచాలి.
- ప్రతి బంకు దగ్గర గాలి మిషన్ ఏర్పాటు చేసి గాలి నింపేందుకు మనిషి అందుబాటులో ఉంచాలి. డబ్బులు అడగరాదు పూర్తిగా ఉచితం.
- కొలతలు తేడాలు చూసుకునేందుకు తప్పనిసరిగా కొలత క్యాన్లు పెట్టాలి.
- పెట్రోల్ డీజిల్‌లో నాణ్యత తెలుసుకునేందుకు లిట్మస్ పేపర్ ఉంచాలి. దానిమీద ఒక చుక్క ఆయిల్ పోసాక అది రంగు మారితే సరైన ఇంధనం కానట్టే.
- మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచాలి. నీరు అందుబాటులో ఉండాలి.
- అగ్ని ప్రమాదాల నివారణకు సిలిండర్‌తో పాటు ఇసుక అందుబాటులో ఉండాలి.
- అత్యవసర సేవలు, సమస్యలను అధికారులు దృష్టికి తీసుకెళ్లేందుకు బోర్డుపై టోల్ ఫ్రీ నెంబరు, ఈమెయిల్ ఐడి రాయాలి.

అడిగినా వాహనాలకి గాలి పట్టరు

- సుబ్రహ్మణ్యం, పెరుమాలపంట గ్రామం



యాదమరిలోని మురుగన్ ఫ్యూయల్ ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌లో వాహనాలకు గాలి పట్టమని అడిగా పట్టరు. గత సంవత్సర కాలంగా మిషన్ రిపేరు అయ్యిందనే చెబుతున్నారు తప్ప ఇప్పటి వరకు పట్టించుకోలేదు. ఇక్కడ వాహనాలకు పెట్రోల్, డీజిల్ వేసుకొని ఎదురుగా ఉన్న పంచర్ షాపుల వద్ద వెళ్లి డబ్బులు ఇచ్చి గాలి పట్టుకుంటున్నాం. వినియోగదారులకు సరైన సౌకర్యాలు కల్పించడం లేదు. సిబ్బందిని ప్రశ్నిస్తే సరైన సమాధానం ఇవ్వడం లేదు.

మరుగుదొడ్లు కూడా ఉండవు..

- చిట్టిబాబు, బుడితి రెడ్డిపల్లి



ఇండియన్ ఆయిల్‌లో కనీసం మరుగుదొడ్లు, తాగునీరు కూడా అందుబాటులో లేవు. గత మూడు నెలలుగా తలుపులకు తాళాలు వేసే ఉంది. ఇది అంతర్రాష్ట్ర రహదారి కావడంతో ఎక్కువ సంఖ్యలో వాహనాలు పెట్రోల్ డీజిల్ పట్టుకోవడానికి ఈ దారిలో వెళ్తుంటారు. దూరప్రాంతాల నుంచి వచ్చే వినియోగదారులు బాత్రూంలోకి వెళ్లాలన్నా అక్కడ సౌకర్యాలు కల్పించలేదు. ఉన్న బాత్రూంకి తాళాలు వేశారు. తాగునీరు అందుబాటులో ఉంచరు.

ఉర్దూ పాఠశాలకు ఒకే గది..!

- మౌలిక వసతులు శూన్యం
- ఆరుబయటే బోధనలు
- చినుకు పడితే ఇంటి ముఖం
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - పలమనేరు రూరల్ (గంగవరం): ఉర్దూ పాఠశాల ఒకే గదిలో కొనసాగుతోంది. ఆ పాఠశాలలో మౌలిక సౌకర్యాలు పూర్తిగా కరువయ్యాయి. ఆరు బయటే బోధన సాగిస్తున్నారు. చినుకు పడితే ఇంటి దారి పట్టాల్సిన దుస్థితి ఏర్పడింది. గంగవరం మండలం గండ్రాజు పల్లి పంచాయతీ ఉగిని గ్రామంలోఉర్దూ పాఠశాల దుస్థితి ఇదీ..

మౌలిక వసతులు శూన్యం

గండ్రాజు పల్లి పంచాయతీ ఉగిని గ్రామంలోఉర్దూ పాఠశాలలో అందరూ ముస్లింలు కావడంతో ఇక్కడ ప్రత్యేకంగా ఉర్దూ పాఠశాల వుంది. ఇందులో సుమారు 160 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. అందులో 57 మంది అబ్బాయిలు, మిగిలి వారు అమ్మాయిలు.. ఆరో తరగతి 36 మంది, ఏడో తరగతి 36 మంది, ఎనిమిదో తరగతి 41 మంది, 9 వ తరగతిలో 25 మంది పదవ తరగతిలో 22 మంది ఉన్నారు. గతంలో ఉన్న భవనాలు కూలడానికి సిద్ధంగా ఉండడంతో విధి లేని పరిస్థితులలో విద్యార్థులు ఎండైనా వర్షమైనా ఆరుబయటే చదువుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఆటస్థలం కూడా లేదు. పాఠశాల వ్యవసాయ పొలాలకు దగ్గరగా ఉండడంతో వర్షాకాలం అయితే పట్టపగలే దోమలు కుడుతున్నా విధి లేని పరిస్థితులలో చదువుకోవాల్సిన దుస్థితి నెలకొంది అధికారులు, పాలకులు మాత్రం ఏమీ తెలియనట్లు మౌనం వహిస్తున్నారు. కనీసం విద్యార్థులకు మరుగుదొడ్లు, తాగునీరు సైతం లేకపోవడంతో విద్యార్థులు అటు తల్లిదండ్రులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

రవాణా సౌకర్యం కరువు

జాతీయ రహదారికి ఒకటిన్నర కిలోమీటరు దూరం ఉండడంతో రవాణా సౌకర్యం కూడా లేకపోవడంతో అక్కడ విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు కాలినడకతో పాఠశాలకు చేరుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో సమయానికి పాఠశాలకు చేరుకోలేకపోతున్నారు. కొంతమంది విద్యార్థులు ఆఫీస్ రూంలో కూర్చో బెట్టడంతో ఉపాధ్యాయులు ఆ ఇరుకు గదిలోనే కూర్చోవడానికి చోటు లేక పాఠశాల ముగిసే దాక నిలబడి విధులు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది.

మరెక్కడైనా పాఠశాల నిర్మించాలి

జాతీయ రహదారికి అతి సమీపంలో రైతేసేవా కేంద్రం, సచివాలయం , పరిసర ప్రాంతాలు పుష్కలంగా ఉన్నాయి. ఆ ప్రాంతంలో ఎక్కడైనా పాఠశాల భవనం నిర్మిస్తే విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకు సౌకర్యంగా ఉంటుంది. అనవసరమైన వాటికి కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారు... ముఖ్యమైన విద్య ఆరోగ్యం వంటి వాటికి మౌలిక వస తులు, భవనాలు లేకపోవడం బాధాకరం.. మా గ్రామానికి చుట్టుపక్కల ఎక్కడ ఉర్దూ పాఠశాల లేదు. విధి లేని పరిస్థితుల్లో పిల్లలను ఈ పాఠశాలకు పంపిస్తున్నాం.. మేము బతుకు తెరువు కోసం దూరప్రాంతాలకు వెళుతుంటాం.. సమయానికి ఇల్లు చేరుకోలేక పోతున్నాం.. అందుకే మా పిల్లలను సొంత గ్రామంలోని చదివిస్తున్నాం..అధికారులు మా పిల్లలకు నూతన భవనం ఏర్పాటు చేసి మౌలిక వసతులు కల్పించాలి..

- ఉగిని గ్రామస్తులు.



ఆఫీసు గదిలోనే కూర్చున్న విద్యార్థులు

అధికారులకు తెలిసినా పట్టించుకోలేదు



ప్రభుత్వానికి అధికారులకు ఇక్కడ పరిస్థితులు అన్ని తెలిసినా పట్టించుకో వడంలేదు. పాఠశాల ఎలా ఉన్నా మా విధులు మేము తప్పక నిర్వహించాల్సి వుంది.. అందుకే ఎలాంటి వసతులు లేకున్నా ఉపాధ్యాయులతో పాటు నేనూ విధులు నిర్వహిస్తున్నా.. నేనేమీ సమస్యలు పరిష్కరిం చడానికి వీలులేదు..

- పిలత, ప్రధానోపాధ్యాయురాలు.



స్థలం లేక ఆరుబయటే కూర్చున్న విద్యార్థులు

సమృద్ధిగా వర్షాలు.. కళకళ లాడుతున్న చెరువులు

జలహారతిలో ఎమ్మెల్యే

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలనలో వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయని, చెరువులు నీటితో కళకలాడుతూ.. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ అన్నారు. ఆదివారం గుడిపాల మండలంలో జలహారతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మొదటగా గుడిపాల చెరువులో గంగాదేవికి శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించి పసుపు, కుంకుమ, సారే సమర్పించారు. అనంతరం వసంతాపురం బంగారక్క చెరువులో నిర్వహించిన జలహారతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షాలు సమృద్ధిగా కురవడంతో రైతులు వ్యవసాయ పనుల్లో మునిగిపోయారని, రైతులు బాగుంటే రాష్ట్రం బాగుంటుందన్నారు. కార్యక్రమంలో చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, టిడిపి చిత్తూరు పార్లమెంటరీ అధ్యక్షులు సీఆర్ రాజన్, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు, ఎమ్మెల్యే తల్లిదండ్రులు రజని, గురజాల చెన్నకేశవుల నాయుడు, మండల ఉపాధ్యక్షులు ధనసింగ్, ప్రధాన కార్యదర్శి బాలసుబ్రమణ్యం యాదవ్, సింగల్ విండో అధ్యక్షులు ప్రతాప్ నాయుడు పాల్గొన్నారు.

వన్ నేషన్ - వన్ ట్యాక్స్ చారిత్రాత్మక నిర్ణయం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: భారతదేశంలో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుండి ప్రజలకు మేలు కలిగించే పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నామని, అందులో వన్ నేషన్ - వన్ ట్యాక్స్ అమలు అనేది చారిత్రాత్మక నిర్ణయమని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. ఆదివారం సూపర్ జీఎస్టీ- సూపర్ తగ్గింపు జిల్లాలోని అన్ని శాఖల ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలేభవన్, సుమారు 36 స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యేతోపాటు నగర మేయర్ అముద, జీడి నెల్లూరు ఎమ్మెల్యే థామస్, చూడ ఛైర్ పర్సన్ కటారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, డీఆర్ఓ మోహన్ కుమార్ పాల్గొన్నారు. జిఎస్‌టి 2.0 ద్వారా కలిగే మేలు పై ప్రజలకు అవగాహన కలిగించేలా నెల రోజులగా విస్తృతంగా సదస్సులు నిర్వహించడం జరిగిందని నేడు ఈ కార్యక్రమ ముగింపు సభ నిర్వహించుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో కమర్షియల్ ట్యాక్స్ అధికారి రఘునాథరెడ్డి, టిడిపి జిల్లా అధ్యక్షుడు సిఆర్.రాజన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ వెంకటేష్ యాదవ్, ఆర్డీవో శ్రీనివాసులు, చిత్తూరు తహశీల్దార్ పాల్గొన్నారు.

సీఎం స్పందన హర్షణీయం: ఏపీ ఎన్జీవోస్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: దీపావళి పండుగకు ముందే ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించడం, ముఖ్యమంత్రితో గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్‌తో జరిగిన స్నేహపూర్వకమైన, గౌరవప్రదమైన, హుందాతన చర్చలు దాదాపు ఐదు సంవత్సరాల తర్వాత ఈ స్థాయిలో జరగడం చాలా సంతోష దాయకమని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర మంత్రులకు ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షులు రాఘవులు శుభాకాంక్షలు కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం స్థానిక ఎన్జీవో హోంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగ సంఘాల డిమాండ్లపై ప్రభుత్వంతో సమావేశం ఏర్పాటు చేయాలని పట్టుబట్టి సమావేశాన్ని ఏర్పాటు చేసేలా చేసిన ఏపీ జేఏసీ అధ్యక్షులు, ఏపీ ఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి రమణకి చిత్తూరు జిల్లా ఉద్యోగ సంఘాల తరపున శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజాశక్తి-కుప్పం: ఉద్యోగ, ఉపాధ్యా యులకు ప్రభుత్వం డీఏ ప్రకటించడంతో ఆదివారం కుప్పం పట్టణంలో ఉపాధ్యా యులు సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. దీపావళి కానుకగా ప్రభుత్వం డీఏ ప్రకటించడం పట్ల ఉపాధ్యాయ సంఘ నేతలు కేశవులు, రాజేశ్వర కుమార్, శ్రీరాములు సురేంద్రబాబు, నారాయణ స్వామి తదితరులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గాలి సురేష్, రామచంద్ర, రామ సుబ్రహ్మణ్యం, భాస్కర్, గణపతి, తులసీదాసు, అనంద్ రెడ్డి పాల్గొన్నారు.



డీఏ ప్రకటనపై హర్షం వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయ సంఘం నేతలు

కౌండిన్య నదిపై వంతెన నిర్మించాలి

ప్రజాశక్తి-పలమనేరు: జల్లి పేట గ్రామానికి వెళ్లే దారిలోని కౌండిన్య నదిపై వంతెన నిర్మించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ నాగరాజు కోరారు. ఆదివారం ఆయన పలమనేరు సిపిఐ పట్టణ కార్యదర్శి బుర్ర మంజునాథ్ బాబు, నాయకులు వి రమేష్, పిరఘులు జల్లి పేట గ్రామానికి వెళ్లే దారిలోని కౌండిన్య నదిని సందర్శించారు. మూడు గ్రామాల ప్రజలు వెళ్లే రోడ్డు పరిస్థితిని తెలుసుకున్నారు. పలమనేరు నియోజకవర్గంలోని కూర్మాయి పంచాయతీ, జల్లి పేట గ్రామం, వెంకటేశ్వరపురం, ముడి వారి పల్లె గ్రామానికి వెళ్లాలంటే కౌండిన్య నదిపైనే వెళ్లాల్సి వుంది. వర్షా కాలంలో వర్షం వచ్చినప్పుడల్లా ప్రవాహం వచ్చి రోడ్లన్నీ ప్రవాహంలో కొట్టుకుపోయి గుంతల గుంతలుగా ఏర్పడి మూడు గ్రామాల ప్రజలు దాటుకోవడానికి కూడా చాలా ఇబ్బం దులకు గురి అవుతున్నారన్నారు. ఆ మూడు గ్రామాల్లో సుమారు ఐదు వందల కుటుంబాలు నివసిస్తు న్నాయని తెలిపారు. వారికి రాకపోకలు లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఎవరైనా అనారోగ్యంతో ఉన్నవారిని ఆసుపత్రికి తీసుకెళ్లాలన్నా నానా ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన దుస్థితి ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే, మాజీ మంత్రి అమరనాథ్ రెడ్డి జోక్యం చేసుకొని కౌండిన్య నదిపై వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కూర్మాయి పంచాయతీ లోని జల్లిపేట, వెంకటేశ్వరపురం, ముడివారి పల్లె గ్రామ ప్రజలకు సౌకర్యం కల్పించి న్యాయం చేయాలని వారు కోరారు.

ప్రజా సమస్యలు పరిష్కారమే లక్ష్యం

- ప్రభుత్వ విప్ డాక్టర్ థామస్

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: ప్రజా సమస్యలే పరిష్కారమే తన లక్ష్యం అని ప్రభుత్వ విప్ డాక్టర్ థామస్ అన్నారు. గంగాధర నెల్లూరు మండలం పెద్దకాలవ పంచాయతీ లో ఎల్లమ్మ రాజు పల్లిలో ఆదివారం నిర్వహించిన సమస్యల పరిష్కార కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టరు థామస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలు అర్జీలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరించాలని అధికారులకు ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా సంక్షేమం అందిస్తున్నామని ఆయన తెలిపారు. గంగాధర నెల్లూరు మండలం పెద్దకాలువ పంచాయతీ ఎల్లమ్మరాజు పల్లి లో ఇటీవల కురిసిన భారీ వర్షానికి ఇల్లు కోల్పోయిన ఎం కుమారి స్థానిక టిడిపి నేత దీపక్ చౌదరి ద్వారా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో 50 వేల రూపాయలు చెక్కును ఆయన బాధితురాలికి అందించారు. ఈ కార్యక్రమంలో పెనుమూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ కృష్ణ నాయుడు, జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్, జనసేన ఇన్‌చార్జ్ పొన్న యుగంధర్, మండల టిడిపి అధ్యక్షుడు స్వామిదాస్, నియోజకవర్గ కమ్మ వారి వైభవ అధ్యక్షుడు దీపక్ చౌదరి, యువ నాయకుడు హరీష్ యాదవ్, మహిళ నాయకురాలు శిల్ప, రఘు నాయుడు, శరవణ కుమార్, సురేందర్ రెడ్డి, సునీల్ నాయుడు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు లోకమ్మ, నియాజ్ అలీ, సింగిల్ విండో డైరెక్టర్ జ్యోతి యాదవ్, పెనుమూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ అరుల్ నాథన్, పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.



ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తున్న ప్రభుత్వ విప్ డాక్టర్ థామస్

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి- రామకుప్పం: కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాల పరస్పర సహకారంతో సామాన్య ప్రజలకు లబ్ధి చేకూర్చేలా జిఎస్‌టీని తగ్గించడంతో సిఎం చంద్రబాబు చిత్రపటానికి కూటమి నేతలు ఆదివారం పాలాభిషేకం చేశారు. విజలాపురం వేణు గోపాల స్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజల అనంతరం పాలాభిషేకం చేశారు. జిఎస్‌టిని 18 శాతం నుండి తగ్గించిన ఘనత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సులోచన గుర్రప్ప, వైస్ ఎంపీపీ వెంకట్రామ గౌడు, యూనిట్ ఇన్‌చార్జ్ రామ్మూర్తి, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు రెడ్డి, కుమార్ వేణుగోపాల్ గౌడ్, రవి, నారాయణదాసు, జనార్ధన్ రెడ్డి ,విశ్వనాథ్ రెడ్డి, సుబ్రహ్మణ్యం, నాగరాజు, రామచంద్ర పాల్గొన్నారు.



బలిజ కండ్రిగ రోడ్డు బాలయ్య కొత్తూరు వద్ద పెద్ద గుంతగా ఉన్న దృశ్యం

దారి ఇలా.. ప్రయాణం ఎలా..?

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: మండలంలోని కొత్తవెంకటాపురం రోడ్డు అగ్రహారం నుంచి పారంమిట్ట వరకు రోడ్డు అక్కడక్కడా కంకర తేలి గుంతల మయమైంది. నిత్యం తమిళనాడులోని రాణిపేట, వేలూరుకు ఈ రోడ్డుపై అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. ఈ గుంతల మయమైన రోడ్డులో వెళ్లాలంటే ప్రాణాలు అర చేతిలో పెట్టుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తు న్నారు. కనీసం మరమ్మతులైనా చేయాలని గ్రామస్తులు, వాహనదారులు వాపో తున్నారు. తూగుండ్రం పంచాయతీ కండ్రిగ దళితవాడ నుండి పిల్లారి కుప్పం గ్రామం వరకు అక్కడక్కడా పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి రాక పోకులకు వాహనదారులు గ్రామస్తు లు అవస్థలు పడాల్సి వస్తోందని వాపోతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు వెంటనే స్పందించి కనీసం రహదారిపై గుంతలైనా పూడ్చాలని స్థానికులు కోరు తున్నారు.



కొత్త వెంకటాపురం రోడ్డు పారం మిట్టవద్ద కంకర తేలిన రోడ్డు

అవగాహన ర్యాలీ



ప్రజాశక్తి- పలమనేరు: స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా ప్రతినెలా నిర్వహించే పారిశుధ్య నిర్వహణను పలమనేరు పురపాలక సంఘంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా క్లీన్ ఎయిర్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని పలమనేరు పురపాలక సంఘ కార్యాలయం నుండి అంబేద్కర్ కూడలి వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఎన్‌వి రమణారెడ్డి మాట్లాడుతూ ప్రజలు అందరూ ప్రజా రవాణా వ్యవస్థను విరివిగా ఉపయోగించాలని తద్వారా వాతావరణ కాలుష్యాన్ని నివారించవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ టెర్రస్ గార్డెన్ ను ఇంటి మిద్దెపైన మొక్కలను పెంచాలని, పూల మొక్కలు, పండ్ల మొక్కలు నాటడం వల్ల గాలిలో కార్బన్ డై ఆక్సైడ్ తగ్గి స్వచ్ఛమైన ఆక్సిజన్ పెరుగుతుందన్నారు. పారిశుధ్య కార్మికులకు సహకరించి తడి చెత్త - పొడి చెత్త వేరు వేరుగా అందించాలని కోరారు. ప్రజలందరూ మొక్కలు నాటి 'స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ పలమనేరును సాధించాలని పిలుపునిచ్చారు. అనంతరం పలమనేరు పురపాలక సంఘ ఆవరణలోని బాపూజీ ఉద్యానవనంలో మొక్కలు నాటారు. నెడ్‌క్యాప్ ఆధ్వర్యంలో సోలార్ ఎనర్జీకి సంబంధించి ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. కమిషనర్ రమణా రెడ్డి మాట్లాడుతూ గతంలో పునరుత్పాదక శక్తి పరికరాలపై జిఎస్‌టి - సౌరశక్తి పరికరాలు గతంలో 12 శాతం వుండగా ఇప్పుడు 5 శాతంగా, పవన శక్తి పరికరాలు గతంలో 12 శాతం ఇప్పుడు ఐదు శాతంగా, జల విద్యుత్ పరికరాలు గతంలో 12, ఇప్పుడు ఐదు శాతంగా, బయో గ్యాస్ యూనిట్ ధర గతంలో రూ.1.5 లక్షలు, ఇప్పుడు రూ.1.4 లక్షలు, ఐదు శాతం సోలార్ పంపు గతంలో రూ.1.5 లక్షలు, ఇప్పుడు రూ.2.21 లక్షలుగా జిఎస్‌టి తగ్గింపు ప్రయోజనాలు వున్నాయని తెలిపారు. పలమనేరు ఎడిఇ జీవన్ కుమార్ మాట్లాడుతూ పిఎం సూర్యగర్ మఫ్త్ బిజిలి యోజన 2 (పిఎం సూర్యఘర్ ముఫ్తి బిజిలీ యోజన) సోలార్ పానెల్స్ ఏర్పాటు చేసుకొని, వాటి ద్వారా వచ్చే సబ్సిడీలను ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు. సోలార్ ఎనర్జీ ద్వారా వాతావరణ కాలుష్యం చాలా వరకు నివారించవచ్చునని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో భాస్కర్ , మునిసిపల్ మేనేజర్ ఎస్ఎం ఖాదర్ మొహిద్దీన్, అసిస్టెంట్ ఇంజనీర్ స్నేహ ప్రియ, ఇందిర, టిపివో, జిఎస్‌టి ఆఫీసర్స్ యోగేంద్ర నాయుడు, చాణిక్య , బాబా, మెప్మా , పలమనేరు పట్టణ విద్యుత్ ఎడిఇ జీవన్ కుమార్, అర్జున్, సిబ్బంది, ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ డెవలప్‌మెంట్ సభ్యులు నాగరాజు , కౌన్సిలర్ బిఆర్‌సి కుమార్ శెట్టి , మెప్మా ఆర్‌పిలు, పురపాలక సంఘ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, పలమనేరు పరిరక్షణ సమితి సభ్యులు పాల్గొన్నారు.

వైట్‌రైస్ కన్నా సేంద్రియ పద్ధతిలో పండించిన బ్లాక్ రైస్ శ్రేష్టం

ప్రజాశక్తి -పలమనేరు: మనం సాధారణంగా తెలుపు రంగు బియ్యం చూసివుంటాం..వీటి వాడకం గురించి అందరికి తెలిసిందే.. కానీ తక్కువ మందికి పరిచమైన రైస్ కూడ ఒక్కటి ఉంది..అదే బ్లాక్ రైస్.. ఈ రైస్ రాజులు, చక్రవర్తులు కాలం నాటి బియ్యం అని చెబుతుంటారు.. దీన్ని రహస్యంగా ఆ కాలంలో సాగు చేసి దీన్ని భుజించే వారని పలమనేరు మండలం కూర్మాయి పంచాయతీ కూర్మాయి గ్రామానికి చెందిన చందూల్ కుమార్ రెడ్డి తెలిపారు. గత మూడేళ్లుగా తాను ప్రకృతి వ్యవసాయం చేస్తున్నానని, తమ దగ్గర 18 రకాల దేశ వాళీ రకం బియ్యం అందుబాటులో ఉందని తెలిపారు. వీటిని కొన్ని ఏళ్లుగా ఆన్‌లైను, ఆఫ్ లైన్ మార్కెటింగ్ కూడా చేస్తున్నామన్నారు. వీటి ధరలు అమెజాన్, మాల్స్, సూపర్ మార్కెట్ వంటివాటితో పోల్చితే తమ దగ్గర చాలా తక్కువ దరకే లభిస్తాయని తెలిపాడు.

ఔషధగుణాలు అద్భుతం

మనం తింటున్న తెలుపు రంగు వరి పంట కాలం నాలుగు నెలలు మాత్రమే. అద్భుతమైన ఔషధ గుణాలున్న బ్లాక్ రైస్ రకం ఇప్పుడు రైతులకు వరంగా మారింది. గతంలో తమిళనాడు కన్యాకుమారి ప్రాంతంలో అక్కడి పూర్వీకులు సహజ పద్ధతిలో సాగు చేస్తూ వరి విత్తనాలను కాపాడుకుంటూ వచ్చారు. అవే నేటి తరాలకు ఆందుబాటులోకి వస్తున్నాయి. తమిళనాడు ప్రాంతం నుంచి మాపిళ్ళై సాంబ(బ్లాక్ రైస్) విత్తనాలను తెచ్చి పలమనేరు మండలంలోని కూర్మాయి వద్ద రైతు చందూల్ కుమార్ ప్రయోగాత్మకంగా ఈ వంగడాన్ని కొన్నళ్లుగా సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తున్నారు. ఆయన తన అనుభవనాలు 'ప్రజాశక్తి'తో పంచుకున్నారు.

ఊపందుకున్న సాగు..

పలమనేరు మండలంలోని కూర్మాయి గ్రామం వద్ద చందూల్ కుమార్ అనే ప్రకృతి రైతు మూడేళ్లుగా బ్లాక్ రైసు సాగు చేస్తున్నాడు. ఈ విడత సైతం తన ఎకరా పొలంలో ఈ వంగడాన్ని నాటాడు. ప్రస్తుతం వరి పంట ఆరు ఆడుగులకు పైగా పెరిగి ఏపుగా ఎన్ను పట్టింది. రైతు పూర్తిగా సేంద్రియ సహజ పద్ధతిలో పంట సాగు చేశాడు. సాధారణంగా వరి పంట కాలం నాలుగు నెలలుగా ఉంటే దీనికి ఏడు నెలలు ఉంటుంది. ఈ రైతు పండించిన రకానికి చుట్టుపక్కల ప్రాంతాల నుంచే కాకుండా కర్ణాటక నుంచి సైతం రైతులు సందర్శించి వెళుతున్నారని తెలిపారు.

30 ఎకరాల్లో బ్లాక్‌రైస్ సాగు



ఈ విడత పలమనేరు వ్యవసాయశాఖ డివిజన్ దాదాపు ఐదు, ఆరుగురు రైతులు సుమారు 30 ఎకరాల్లో బ్లాక్ రైస్ సాగు చేస్తున్నారు. ఈ రైసు ఆరోగ్యానికి చాలా మంచిది.. మార్కెట్లో కూడా మంచి గిరాకీ ఉంది.. దేశవాళి వరి వంగడాల్లో అగ్రస్థానం హరితవిప్లవం తర్వాత పలు రకాల హైబ్రిడ్ వరివంగడాలు సృష్టించి రెండు వేల దాకా వంగడాలు సాగులో ఉన్నాయి. అనాదిగా కొన్ని రాష్ట్రాల్లో మాత్రం దేశవాళి రకాలు వంశపారం పర్యంగా సాగులో ఉంటూ ఆ విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. ఇలాంటివి 26 కాగా వీటిలో అత్యంత పోషకాలు కలిగిన ఔషధ గుణాలున్న వరుసలో తొలిస్థానం మాత్రం బ్లాక్ రైస్.. అందుకే మార్కెట్లో దీనికి మంచి డిమాండు వుంది.

- బి సంధ్య, పలమనేరు పట్టణ వ్యవసాయాధికారి.

కిలో ధర రూ.200 పైమాటే

దుకాణాల్లో బ్లాక్ రైస్ పెద్దగా అందుబాటులో లేదు. అమెజాన్, ఫ్లిప్ కార్డ్ లాంటి పలు కంపెనీలు కిలో నుంచి మూడు, ఐదు కిలోల బ్యాగుల్లో వీటిని ఆన్‌లైనులో విక్రయిస్తున్నారు. డీమార్ట్, బిగ్బాస్కెట్‌లాంటి మార్ట్‌లో అందుబాబులో ఉన్నాయి. కిలో రూ.160 నుంచి రూ.250 దాకా కంపెనీలను బట్టి ధరలున్నాయని తెలిపారు. తాను మూడేళ్ల నుంచి ప్రకృతి సేద్యంలో భాగంగా బ్లాక్ రైస్‌ను సాగు చేస్తున్నానని, ఇప్పుడు పంట గింజ దశలో ఉందని తెలిపారు. మంచి డిమాండ్ ఉన్న ఇలాంటి వరి వంగడాన్ని ఈ ప్రాంత రైతులకు పరిచయం చేసి సాగును పెంచాలని భావిస్తున్నానని ప్రకృతి వ్యవసాయ రైతు చందూల్ కుమార్ తెలిపారు. ఇందులో ఎన్నో ఔషధ గుణాలున్నాయని ముఖ్యంగా డయాబెటిస్ ఉన్న వారికి ఇది చక్కటి ఆహారమని తెలిపారు.

బ్లాక్ రైస్ ప్రత్యేకత

ఈ రైస్ నలుపు రంగులో ఉంటుంది. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువ మోతాదులో ఉంటాయి. యాంటీ కేన్సర్ కారకాలు ఈ రైస్ లో ఉంటాయి. మన శరీరంలో కేన్సర్ కారకాలు ఉంటే వాటిని కరిగించే శక్తి వీటికి ఉంటుంది. ఇందులో బి 12 విటమిన్స్ పుష్కలంగా ఉన్నాయన్నారు. బ్లాక్ రైస్ ను కాలపాటి బియ్యం అని కూడా అంటారని ఒక పిడికిడి బ్లాక్ రైస్ తింటే అర్ధ కేజీ మటన్ లో ఉండే బి 12 విటమిన్స్ లభిస్తాయని తెలిపారు. రైస్ జిగట, తినడానికి కమ్మగా ఉంటుందన్నారు. షుగరు బీపీ ఉన్నవారు రోజు వారీ ఆహారం తీసుకొంటే చాలు షుగరు, బీపీ ను కంట్రోల్ చేయొచ్చన్నారు. చిన్న పిల్లలకు స్వీట్, పాయసం వంటివి చేసి పెడితే చాలా ఇష్టంగా తింటారన్నారు. ఆన్లైన్ , ఫ్లిప్ కార్డులో ఈ రైస్ ధర రూ.300పైనే అన్నారు. బయట దేశాల్లో అమెరికా వంటి ప్రదేశాల్లో కిలో ధర రూ.600 నుండి 700 అన్నారు. రైతుగా రూ.130 అమ్ముతున్నామన్నారు. ఈ ధర వస్తే చాలు రైతుగా ఆనందంగా వుండొచ్చన్నారు. ఈ సాగు మొత్తం రసాయనిక ఎరువులు లేకుండా సేంద్రియ పద్ధతిలో పాలేకర్ అడుగుజాడల్లో సలహాలు, సూచనలు మేరకే సాగు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.



చందూల్ కుమార్ రెడ్డి



క్రైం న్యూస్



ప్రమాదంలో దెబ్బతిన్న కారు



బోల్తాపడిన పెట్రోలు ట్యాంకరు

అదుపుతప్పి పెట్రోలు ట్యాంకర్‌ను ఢీకొన్న కారు

తృటిలో తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి -బంగారుపాళ్యం : రోడ్డుపై వెళుతున్న కారు అదుపు తప్పి డివైడర్ ను దాటి పక్కనే వెళుతున్న పెట్రోలు ట్యాంకర్‌ను ఢీకొనడంతో పెట్రోలు ట్యాంకరు బోల్తాపడింది. స్థానికులు పెట్రోలు లీక్ కావడం గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో అప్రమత్తమైన పోలీసులు అగ్నిమాపక సిబ్బందిని వెంటతీసుకొచ్చి ప్రమాద నివారణ చర్యలు చేపట్టారు. దీంతో పెనుప్రమాదం తప్పింది. ఈ సంఘటన మండలం లోని సంక్రాంతి పల్లి వద్ద చోటు చేసుకుంది. పలమనేరు నుండి చిత్తూరు వైపు వస్తున్న కారు బంగారు పాళెం సంక్రాంతిపల్లిని సమీపిస్తుండగా అదుపుతప్పి డివైడర్ దాటి రోడ్డుపైకి దూసుకు వెళ్లింది. ఎదురుగా యాదమరి మండలం నుండి పలమనేరుకు వెళుతున్న పెట్రోల్ ట్యాంకరును ఢీకొంది. దీంతో పెట్రోలు ట్యాంకరు రహదారికి అడ్డంగా బోల్తా పడటంతో పెట్రోల్ లీకైంది. స్థానికులు దీన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బందికి తెలిపి సంఘటనా స్థలం వద్దకు చేరుకుని భారీ ప్రమాదం నుంచి కాపాడారు.ఈ సంఘటనలో ప్రమాదానికి గురైన వాహన దారులకు స్వల్ప గాయాలయ్యాయి. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.



బావిలో మృతదేహమై తేలిన రాజశ్రీ

బావిలో పడి యువతి మృతి

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: బావిలో పడి యువతి మృతి చెందిన సంఘటన మండలంలోని వెలుతురు చేను పంచాయతీ శ్రీనివాస్‌పురంలో ఆదివారం చోటు చేసుకుంది. సిఐ శ్రీనివాసులు కథనం మేరకు.. వెలుతురు చేను పంచాయతీ శ్రీనివాస్ పురం గ్రామానికి చెందిన ప్రకాష్ భార్య రాజశ్రీ (20) రెండు రోజులుగా కనిపించకపోవడంతో పరిసరాలు అంతా వెతికారు. చివరకు బావిలో మృతదేహమై కనిపించడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆమె మృతికి కారణాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి వుంది.



ఎవరూ లేని ఇంట్లో చోరీ

ప్రజాశక్తి- పూతలపట్టు: ఎవరూ ఇంట్లో లేని సమయంలో చోరీకి పాల్పడ్డ సంఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకుంది. పూతలపట్టు మండలం పికొత్తకోట పంచాయతీ చౌవటపల్లి దళితవాడలో దాము చెందిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలో ఉన్న 60 గ్రాములు బంగారం, మూడు జతలు కాళ్ల పట్టీలు రూ.50 వేల నగదు చోరీ చేశారని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఇంటిని తనిఖీ చేశారు. సిఐ కృష్ణమోహన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ చోరీలో సుమారు ఏడు లక్షల రూపాయల విలువైన ఆభరణాలు చోరీకి గురైందని తెలుస్తోంది.

ఘనంగా ఆయుధపూజ

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు మండలం పోలీస్ స్టేషన్లో ఆదివారం సీఐ శ్రీని వాసంతి ఆధ్వర్యంలో ఆయుధ పూజ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దీపావళి పండుగ సందర్భంగా పోలీస్ స్టేషన్లో కలశం పెట్టి లక్ష్మి దేవి చిత్రపటానికి పూజ చేసి అనంతరం స్టేషన్‌లోని వాహనాలకు ఆయుధ పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్టేషన్‌లోని పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రామకుప్పం: రామకుప్పం టిడిపి కార్యాలయంలో ఆదివారం ఆయుధ పూజను నాయకులు, కార్యకర్తలు ఘనంగా చేపట్టారు. కార్యాలయంలో విశేష పూజలు చేసి, వేద పండితులు నాగరాజు స్వామి గణపతి పూజ మంత్రోచ్ఛారణతో నేతలను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నేతలు మునస్వామి, నారాయణ చారి, టిడిపి మండల, అధ్యక్ష, మాజీ అధ్యక్షులు వెంకటరమణ, ఆనంద రెడ్డి, ఆంజనేయ రెడ్డి, సీతాపతి, నరసింహులు, రామ్మూర్తి, గుర్రప్ప, వెంకట్రామి గౌడు, చలపతి, విశ్వనాథ్, కామరాజు నాయక్, రాజసింహ పాల్గొన్నారు.

